సాక్షి హనుమకొండ

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



94 రైళ్లు రద్దు

రైల్వేలైన్ పనులతో కాజీపేట, వరంగల్ మీదుగా నడిచే పలు రైళ్లను ఈనెల 26వ తేదీ నుంచి రద్దు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. - 8లో▸



కళాభవనం కథ కంచికేనా?

వరంగల్ పోచమ్మమైదాన్‌లో చేపట్టిన మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయింది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

ఓపెన్ 'టెన్త్, ఇంటర్'లో ప్రవేశాలకు ఆహ్వానం



విద్యారణ్యపురి: టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు పొందాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు కోరారు. బుధవారం హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లు, బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలవుదినాల్లో కాంటాక్టు కౌన్సెలింగ్ తరగతులు ఉంటాయని, అడ్మిషన్లు పొందినవారికి పుస్తకాలు అందజేయనున్నట్లు తెలిపారు. అపరాధ రుసుముతో ఈఏడాది అక్టోబర్ 3వ తేదీ వరకు అడ్మిషన్లు పొందవచ్చని పేర్కొన్నారు. టెన్త్‌కు రూ.100, ఇంటర్‌కు రూ.200 అపరాధ రుసుముతో అడ్మిషన్ ఫీజులను ఆన్‌లైన్‌లో చెల్లించాలని అన్నారు. పూర్తి వివరాలకు సమీప అధ్యయన కేంద్రాల కో–ఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీరభద్రం, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ వెంకటేశం, ఉపాధ్యాయులు పిల్లి శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సమ్మయ్య, సునీత, కమలశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



ఎంజీఎం : నగరంలోని స్లమ్, వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు వైద్యాధికారులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ లలితాదేవి ఆదేశించారు. బుధవారం పోచమ్మకుంట, లష్కర్ సింగారం ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రాల్లో జ్వర సర్వే, మెడికల్ క్యాంపు వివరాలు, మెడికల్ స్టోర్‌లను పరిశీలించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రై డే నిర్వహించి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ హరిత, డాక్టర్ హైదర్, హెల్త్ సూపర్‌వైజర్ విప్లవ్, హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జీపీగా పోతరాజు రవి



వరంగల్ లీగల్ : వరంగల్ జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా న్యాయవాది పోతరాజు రవిని నియమిస్తూ వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టులో 2002 సంవత్సరం నుంచి న్యాయవాదిగా పనిచేస్తున్న రవి.. గతంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా వ్యవహరించారు. ఆయన గవర్నమెంట్ ప్లీడర్ పదవిలో ఆరు నెలల పాటు ఉండనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాక్సర్ సాయి అక్షితకు కలెక్టర్ అభినందనలు



వరంగల్ స్పోర్ట్స్: ఇటీవల నోయిడాలో జరిగిన జాతీయ స్థాయి ఆర్ఈసీ టాలెంట్ హంట్ ఫేజ్–1 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన కందుకూరి సాయిఅక్షితను బుధవారం కలెక్టర్ ప్రావీణ్య అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని చాటాలని కలెక్టర్ అన్నారు. క్రీడాకారిణి సాయి అక్షిత వెంట హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్ ప్రభుదాస్ ఉన్నారు.

డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో..

వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్‌ఏ బాక్సింగ్‌హాల్‌లో సాయిఅక్షితను శాలువాతో సత్కరించారు. సాయి అక్షితతో పాటు మెరుగైన శిక్షణ అందించిన కోచ్ ప్రభుదాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమన్నారాయణ, అసోసియేషన్ బాధ్యులు రవీందర్, చంద్రమౌళి, ప్రభాకర్ పాల్గొన్నారు.

గుమ్మడి.. తగ్గిన దిగుబడి

- భారీ వర్షాలతో కుళ్లిపోతున్న కాత, పూత
- దాదాపు 200 ఎకరాలకు పైగా పంట నష్టం
- ఆదుకోవాలని వేడుకుంటున్న రైతులు



నాణ్యమైన గుమ్మడి కాయలు ఏరుతున్న రైతు





కుళ్లిపోయిన గుమ్మడి కాయలు, కుళ్లిపోయిన కాయలోని గింజలు చూపుతున్న మహిళా రైతు

పరకాల: ఉంటే అతివృష్టి.. లేదంటే అనావృష్టితో అన్నం పెట్టే అన్నదాత బతుకు ఆగమవుతోంది. పంట చేనుతో పాటు తోటలపై ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతోంది. పూత బతికి కాత కాసిందంటే ఇక రందే లేదనుకునే గుమ్మడి తోటల రైతులు భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయారు. ఎడతెరిపి లేని వర్షాలతో తోటంతా వర్షపు నీరు నిండి కాసిన కాయంతా కుళ్లిపోయింది. ఎలాంటి శుభకార్యమైనా, ఇతర పూజ కార్యక్రమాలకైనా ముందుగా ఉపయోగపడే గుమ్మడి సాగుకు రైతులు ఎంతో కష్టపడ్డారు. ఒక్కో ఎకరాకు రూ.30వేలు పెట్టుబడి పెట్టిన రైతులు వర్షాలతో భారీ నష్టాన్ని చూసి ఆవేదన చెందుతున్నారు. ఒక్క పరకాల డివిజన్‌లోనే ఆత్మకూరు, దామెర మండలాల్లో అత్యధికంగా 200 ఎకరాలు గుమ్మడి సాగు చేసుకుంటుండగా పరకాల, నడికూడ, శాయంపేట మండలాల్లో 300 ఎకరాల వరకు గుమ్మడి తోటలు సాగవుతున్నాయి. 100 మందికి పైగా రైతులు ఈ పంటపై ఆధారపడి చివరికి వరద పాలుకావడం చూసి కంటతడి పెడుతున్నారు. దసరా, దీపావళికి ముందే మార్కెట్‌కు చేరుకోవాల్సిన గుమ్మడి కాయలు తోటల్లోనే కుళ్లిపోయాయి. ఒక్క కాయ కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని దీనంగా చూస్తున్నారు.

ఆకాశాన్నంటనున్న ధరలు

భారీ వర్షాలు గుమ్మడి కాయ పంటపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో దిగుబడి తగ్గుముఖం పట్టి మార్కెట్‌కు తక్కువగా కాయలు రానున్నాయి. ఒక్కో కాయ ధర రూ.100కు పైగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. బూడిద పోయకుండా గుమ్మడిని తెంపడం వల్ల మార్కెట్లో విక్రయానికి వినియోగదారులు పెద్దగా ఆసక్తిగా చూపించడం లేదు. భారీ వర్షాలతో నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని గుమ్మడి పంట సాగు రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి నీళ్లపాలైంది..



రెండెకరాల్లో గుమ్మడి పంట సాగు చేసినం. కాయలన్నీ పెద్దగా అవుతున్నప్పుడే వర్షాలు కురిసి కాయలన్నీ నీళ్లలో ఉండి మురిగిపోయాయి. వర్షపు నీటిలో కనీసం తోటకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షం తగ్గిన తర్వాత కాయలన్నీ గింజలయ్యాయి. రూ.50 వేల పెట్టుబడి మొత్తం నీటి పాలైంది. ప్రభుత్వం మాకు పరిహారం ఇచ్చి న్యాయం చేయాలి.

\- గుర్రం శాంతమ్మ, మహిళా రైతు, పరకాల

పరిహారం చెల్లించాలి..



రాజీపేటకు చెందిన నేను పరకాల శివారులో మూడెకరాల భూమి సాగు చేస్తున్నా. రెండెకరాలు మిర్చి పెట్టి మిగతా ఎకరం భూమిలో రాసగుమ్మడి సాగు చేస్తున్నా. రెండు, మూడ్రోజుల్లో కాయలు కోయలనుకున్నాం. అంతలోపే ఎడతెరిపి లేని వర్షం మొదలైంది. దీంతో తోట వద్దకు వెళ్లే సరికి కాయలన్నీ పనికి రాకుండా కుళ్లిపోయి కనిపించాయి. ప్రభుత్వం పరిహారం చెల్లించి మమ్మల్ని ఆదుకోవాలి.

\- గువ్వ సర్వేశం, రైతు, రాజీపేట

సర్వే చేయాలని ఆదేశించాం..



గుమ్మడి పంటకు నష్టం వాటిల్లినట్లు కొందరు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి పరకాల డివిజన్‌లో గుమ్మడి తోటల సాగు పెరిగిన మాట నిజమే. నష్టపోయిన తోటలను తక్షణమే సర్వే చేసి సంబంధిత వివరాలను అందజేయాలని ఏఈఓలను ఆదేశించాం. బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం.

\- శ్రీనివాస్, ఏఓ, పరకాల

చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజగోపాల్
- కమలాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పద్మశాలి కులస్తులు

కమలాపూర్: చేనేత కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర కార్యదర్శి వైద్యం రాజగోపాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేనేత కార్మికులకు రుణమాఫీ, థ్రిఫ్ట్ ఫండ్, హ్యాండ్లూమ్ టెక్నాలజీ క్యాంపస్‌కు శ్రీకారం చుట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలాపూర్ చేనేత సహకార సంఘం ప్యాకేజీ యూనిట్ ఆవరణలో బుధవారం నేత కార్మికులతో కలిసి పద్మశాలీలు సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం, నాయకులు తొటం రవీందర్, కేదాసి వెంకటేశ్వర్లు, పొరండ్ల రమేశ్, వెంగళ వేణుగోపాల్, తుమ్మ శోభన్‌బాబు, నల్ల సత్యం, పులికంటి రాజేందర్, సంతోశ్‌రాజ్, వెంగళ బాలకృష్ణ, కేడీసీసీబీ డైరెక్టర్ పొరండ్ల కృష్ణప్రసాద్, మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు దాసి శంకరయ్య, సంఘ మేనేజర్ సామల దామోదర్, చేనేత కార్మికులు, పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్: 'కాంగ్రెస్ పేదల ప్రభుత్వం, రాష్ట్రంలోని పేద వర్గాలకు అండగా ఉంటుంది' అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ధర్మసాగర్, వేలేరు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన 72 మందికి బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా వ్యవసాయాన్ని పండుగ చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన మాట మేరకు రుణమాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. నియోజకవర్గంలో అర్హులైన రైతులకు రుణమాఫీ చేసే బాధ్యత తనదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సదానందం, ఎంపీడీఓ అనిల్‌కుమార్, వేలేరు తహసీల్దార్ కోమి, అధికారులు పాల్గొన్నారు.

సుష్మాక్షితకు 349వ ర్యాంకు



ఐనవోలు: దేశవ్యాప్తంగా అగ్రికల్చర్ యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఆల్ ఇండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ అడ్మిషన్ (ఐసీఏఆర్ ఏఐఈఈఏ)లో మండల కేంద్రానికి చెందిన పల్లకొండ సుష్మాక్షిత జనరల్ క్యాటగిరిలో 349 ర్యాంకు సాధించింది. దేశవ్యాప్త ఎస్టీ క్యాటగిరీలో నాలుగో ర్యాంకు సాధించింది. దీంతో సుష్మాక్షిత తండ్రి, ఐనవోలు మాజీ సర్పంచ్ పల్లకొండ సురేశ్ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు మండల నాయకులు ఆమెను ప్రశంసించారు.

17న 'ప్రజా పరిపాలన' వేడుక

- ఉమ్మడి జిల్లాల్లో ఉత్సవాలు.. జాతీయ పతాకావిష్కరణ
- హనుమకొండకు మంత్రి కొండా సురేఖ, వరంగల్‌కు పొంగులేటి..





మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సురేఖ

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఈనెల 17వ తేదీన తెలంగాణ ప్రజా పరిపాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లాల్లో ఆ రోజు ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాలను ఆవిష్కరించి వేడుకలు జరపాలని బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. జాతీయ జెండా ఆవిష్కరించేందుకు అతిథులను కూడా నామినేట్ చేశారు. జాబితా ప్రకారం హనుమకొండలో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), జనగామలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మహబూబాబాద్‌లో ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ముఖ్య అతిథులుగా పతాకావిష్కరణ చేయనున్నారు.

జిల్లాకు రూ.3 కోట్లు కేటాయింపు

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ఇటీవల కురిసిన వర్షాల వల్ల కలిగిన నష్టాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.3 కోట్ల నిధులు కేటాయించినట్లు హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టం అంచనాలపై బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించిందని, వర్షాల వల్ల కలిగిన నష్టానికి ప్రభుత్వం కేటాయించిన ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. కాగా.. సంబంధిత శాఖల అధికారులు నష్టం వివరాలు, ఏయే పనులకు ఎన్ని నిధులు అవసరమో తగిన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని కోరారు. నష్టం జరిగిన ప్రాంతాల్లో త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్డీఓ వెంకటేశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్‌బాబు, పంచాయతీరాజ్ ఈఈ శంకరయ్య, డీఈఓ వాసంతి, జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ వెంకటనారాయణ, జీడబ్ల్యూఎంసీ ఈఈ రాజయ్య అధికారులు ఉన్నారు.

సర్వే చేయకుండా ఎందుకు వచ్చారు?



రింగ్‌రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేస్తున్న 'కుడా', రెవెన్యూ అధికారులను అడ్డుకున్న రైతులు

వరంగల్: సర్వే చేయకుండా ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) భూసేకరణకు ఎందుకు వచ్చారని ఆరెపల్లి, పైడిపల్లి రైతులు 'కుడా', రెవెన్యూ అధికారులను నిలదీశారు. బుధవారం ఐఆర్‌ఆర్ నిర్మాణం కోసం పైడిపల్లి, ఆరెపల్లి గ్రామాల సమీపంలో 'కుడా', రెవెన్యూ అధికారులు వచ్చి కొలతలు తీస్తుండగా రైతులు అడ్డుకున్నారు. తన భూమిలో కట్టెలు పాతారని రైతు రాజేందర్‌రెడ్డి వారిని ప్రశ్నించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రైతులతో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి భూమికి ఎంత ధర చెల్లిస్తారు, ఏ సర్వేనంబర్‌లో ఎంతభూమి పోతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులను సంతృప్తిపరిస్తేనే భూమి ఇచ్చేందుకు అప్పుడు ఆలోచిస్తామన్నారు. గతంలో ఇచ్చిన మ్యాపునకు కొత్త మ్యాపునకు వ్యత్యాసం బాగా ఉందని, భూమి తీసుకునే ఉద్దేశం ఉంటే రైతులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. పరిహారం ఎంత ఇస్తారన్న విషయంపై స్పష్టత వచ్చాకే భూముల్లో అడుగుపెట్టాలని, అప్పటి వరకు సర్వేలు చేపట్టొద్దని రైతులు హెచ్చరించారు. వ్యవసాయ భూములను ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు నిర్మాణం కోసం ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు నామసాని నాగరాజు, రాంరెడ్డి, దినేశ్, జితేందర్, రవి, రాజేందర్, అమర్, శ్రీను, రాజేశ్వర్‌రావు, శివ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్

ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలు

- హనుమకొండ జిల్లాలో 680 సర్వీస్‌లు.. బకాయిలు రూ.265.79 లక్షలు
- వరంగల్ జిల్లాలో 656 సర్వీస్‌లు.. బకాయిలు రూ.234.08 లక్షలు
- బకాయిల చెల్లింపుపై స్పష్టత ఇవ్వని సర్కారు



హన్మకొండ: ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్ర ఇంధన శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 20 జారీ చేసింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు విద్యుత్ తప్పనిసరి. బిల్లులు పేరుకుపోతే విద్యుత్ సంస్థ కరెంటు సరఫరాను నిలిపివేస్తుంది. దీంతో విద్యుత్ అంతరాయం ఉంటే డిజిటల్ తరగతుల నిర్వహణకు ఆటంకం కలుగుతుంది. మరోవైపు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలు ఏసీ సౌకర్యం కల్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం ఫ్యాన్లు కూడా లేని దుస్థితి ఒక వైపు. ఫ్యాన్లు ఉన్నా విద్యుత్ లేకపోవడంతో అవి పనిచేయని పరిస్థితి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కొరవడడంతో రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. ఈ క్రమంలో ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తే ప్రభుత్వ విద్యా సంస్థలకు బలోపేతం అవుతాయి. విద్యుత్ పంపిణీ సంస్థలు ప్రభుత్వ విద్యా సంస్థల వారీగా ప్రత్యేకంగా ఆన్‌లైన్ పోర్టల్ రూపొందిస్తున్నాయి. సంబంధిత సంస్థలకు లాగిన్ అవకాశం కల్పిస్తారు.

ఆయా శాఖల కార్యదర్శులు విద్యాసంస్థల వివరాలను ఈ పోర్టల్‌లో నమోదు చేయాన్నిందులో పొందుపరిచిన సంస్థలకు డిస్కంలు యూనిట్ల వారీగా బిల్లులు నిక్షిప్తం చేస్తాయి. దీంతో పాటు సంబంధిత శాఖ బాధ్యులకు బిల్లు హార్డ్‌కాపీ ఇస్తారు. పోర్టల్‌లో డిస్కంలు పొందుపరిచిన బిల్లుల మేరకు ఆయా శాఖలు బిల్లుల చెల్లింపునకు సంబంధించిన నివేదికలు తయారు చేసుకునేందు కు వీలు కలుగుతుంది. సంస్థలు, జిల్లా, మండలాల వారీగా బిల్లుల సమాచారం పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ బిల్లులు చెల్లించేందుకు వీలుగా ఆయా శాఖలను ఆర్థిక శాఖ పోర్టల్‌తో అనుసంధానిస్తారు. ఉచిత విద్యుత్‌తో విద్యాసంస్థలపై బిల్లుల భారం తప్పనుంది.

బకాయిలు చెల్లించేదెవరు?

విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్ అందిస్తామని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. బకాయిల చెల్లింపుపై ఎక్కడా ప్రస్తావించలేదు. ఈ క్రమంలో బకాయిలు ఎవరు చెల్లిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బకాయిలు రాబట్టుకోవడానికి పంపిణీ సంస్థలు ఎప్పటి మాదిరిగానే విద్యుత్ సరఫరా నిలిపివేస్తే ఉచిత విద్యుత్ సరఫరా అభాసుపాల య్యే అవకాశముందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం బకాయిల చెల్లింపుపై స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. హనుమకొండ జిల్లాలో 680 విద్యా సంస్థలకు రూ.265.79 లక్షల పాత బకాయిలు ఉన్నాయి. ఈ విద్యా సంస్థలు ఆగస్టులో 3,60,775 యూనిట్ల విద్యుత్ వినియోగించగా బిల్లు డిమాండ్ రూ.34.51 లక్షలుగా ఉంది. వరంగల్ జిల్లాలో 656 విద్యా సంస్థలకు రూ.234.08 లక్షల బకాయిలు ఉన్నాయి. ఈ విద్యా సంస్థలు ఆగస్టులో చెల్లించాల్సిన బిల్లు డిమాండ్ రూ.29.94 లక్షలు ఉంది.

హనుమకొండ జిల్లాలో మండలాల వారీగా విద్యా సంస్థలు, బకాయిల వివరాలు..

మండలం	విద్యా సంస్థలు	ఆగస్టు డిమాండ్ (యూనిట్లలో)	బకాయిలు (రూ.లక్షల్లో)
హనుమకొండ	182	14.33	85.96
కాజీపేట	40	3.10	21.09
ఐనవోలు	39	0.74	10.75
హసన్‌పర్తి	64	1.81	19.17
వేలేరు	24	1.83	10.08
ధర్మసాగర్	38	0.40	7.23
ఎల్కతుర్తి	42	1.44	10.37
భీమదేవరపల్లి	54	1.61	8.80
కమలాపూర్	58	4.13	19.58
పరకాల	37	1.28	14.82
నడికూడ	25	0.36	14.07
దామెర	24	0.74	17.00
ఆత్మకూరు	27	0.58	13.54
శాయంపేట	46	2.16	13.32

ఒడిబియ్యం వేలం..

ఆదాయం రూ.1.05 లక్షలు



టెండర్ వివరాలను వివరిస్తున్న దేవాలయ సిబ్బంది

హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో ఏప్రిల్ నుంచి ఈనెల 10వ తేదీ వరకు భక్తులు అమ్మవారికి సమర్పించిన 65 క్వింటాళ్ల ఒడిబియ్యానికి బుధవారం ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించారు. పాటదారు గుండా రమేష్ రూ.1,05,000లకు టెండర్ పొందాడు. కార్యక్రమంలో దేవాదాయశాఖ పరిశీలకులు సంజీవరెడ్డి, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతి, అర్చకులు భద్రకాళి శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగం మరువలేనిది

భద్రాద్రి జోన్ సీసీఎఫ్ భీమానాయక్



అమరుల చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

న్యూశాయంపేట: అటవీ సంపద రక్షణకు, వన్యప్రాణుల పరిరక్షణకు అటవీ ఉద్యోగులు చేస్తున్న కృషి మరువలేనిదని అటవీశాఖ భద్రాద్రి జోన్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్) డి.భీమానాయక్ అన్నారు. జాతీయ అటవీ అమరుల దినోత్సవం సందర్భంగా బుధవారం హనుమకొండ సుబేదారి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో అమరవీరుల విగ్రహానికి, అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హనుమకొండ డీఎఫ్ఓ బి.లావణ్యతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ కృష్ణమాచారి, ఎఫ్ఆర్ఓ సందీప్‌రెడ్డి, భిక్షపతి, శిరీష, బీట్ ఆఫీసర్లు వరంగల్, హనుమకొండ జిల్లాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి న్యూశాయంపేట రైల్వే గేట్ మూసివేత

కాజీపేట అర్బన్: న్యూశాయంపేట రైల్వే గేట్‌ను గురువారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు రైల్వే అధికారులు మూసివేయనున్నట్లు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్లరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాజీపేట ఎఫ్ క్యాబిన్ నుంచి వరంగల్ రైల్వే స్టేషన్ వరకు ట్రాక్ మరమ్మతులో భాగంగా న్యూశాయంపేట రైల్వే గేట్‌ను మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. రాకపోకలు సాగించేవారు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

క్లుప్తంగా

రైల్వే గార్డుల సమస్యలు పరిష్కరించాలి



నిరసనలో పాల్గొన్న ట్రైన్ మేనేజర్లు

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే లోకోపైలెట్ డిపో ఎదుట బుధవారం రైల్వే ట్రైన్ మేనేజర్లు (గార్డులు) తమ డిమాండ్లు పరిష్కరించాలని ధర్నా చేపట్టారు. భారతీయ రైల్వేలో విధులు నిర్వర్తిస్తున్న ట్రైన్ మేనేజర్ల వర్కింగ్ సిస్టమ్‌లో అవసరమైన సేఫ్టీకి సంబంధించిన వస్తువులు, పుస్తకాలు ఉండే లైన్ బాక్స్‌లు తీసేసి వాటి స్థానంలో ట్రాలీ బ్యాగ్స్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా గార్డ్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్నాలో భాగంగా ఇక్కడ ధర్నా చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే నాయకులు, ట్రైన్ మేనేజర్లు పాల్గొన్నారు.

పెచ్చులూడిన పాఠశాల స్లాబు

- ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- బయ్యారంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఘటన



బయ్యారం: బయ్యారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వరండాలోని స్లాబు పెచ్చులూడింది. దీంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఆందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాఠశాల ఆవరణలోని కార్యాలయ వరండా శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబు దెబ్బతినడంతో బుధవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో స్లాబు పెచ్చులూడాయి. ఈ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో తృటిలో పెనుప్రమాదం తప్పింది. ఇప్పటికైనా శిథిలావస్థలోని గదులు తొలగించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు అధికారులను కోరుతున్నారు.

కళాభవనం కథ కంచికేనా?

నిధులు లేక ఆగిపోయిన పనులు

- 11 ఏళ్లు గడిచినా పూర్తికాని పరిస్థితి
- ట్యాక్సీ స్టాండ్‌గా మారిన నిర్మాణ స్థలం
- వరంగల్ తూర్పులో లేని ఆడిటోరియాలు
- ఇబ్బందులు పడుతున్న కళాకారులు



వరంగల్ పోచమ్మమైదాన్‌లో అసంపూర్తిగా కళాభవనం నిర్మాణం



ట్యాక్సీ పార్కింగ్ స్టాండ్‌గా మారిన కళాభవన ప్రాంగణం

వరంగల్: వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలో చేపట్టిన మల్టీపర్పస్ కల్చరల్ కాంప్లెక్స్ (మినీ రవీంద్ర భారతి) నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయింది. 24-05-2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 కోట్ల నిధులు మంజూరు చేయగా.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న బస్వరాజు సారయ్య ముచ్చటగా మూడోసారి శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. ఏడాదిలో కళాభవనం నిర్మించాలన్న నిబంధనలతో హైదరాబాద్‌కు చెందిన శ్రీకో ప్రాజెక్టు నిర్మాణ సంస్థ పనులు దక్కించుకుంది. మొదటి విడత పర్యాటక శాఖ నుంచి కళాభవనం నిర్మాణానికి కోటి రూపాయల నిధులు విడుదల చేశారు. బేస్‌మెంట్‌తోపాటు పిల్లర్లు, జనరేటర్ రూం నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.69.88 లక్షలు చెల్లించారు. నిధులు విడుదలైతే తప్ప మిగిలిన పనులు చేపట్టేది లేదని కాంట్రాక్టర్ భీష్మించుకున్నాడు. దీంతో 11 ఏళ్ల క్రితం ప్రారంభమైన కళాభవనం నిర్మాణ దశలోనే ఉంది. హనుమకొండలో రూ.12 కోట్లతో చేపట్టిన కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ వ్యయం రూ.60 కోట్లకు పెరిగింది. వరంగల్ పశ్చిమ ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు మంజూరు చేయించి పూర్తి చేయించారు. కేవలం రూ.4 కోట్ల వ్యయంతో చేపట్టిన కళాభవనానికి నిధులు తేవడంలో తూర్పు ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కళాభవనం, హరితహోటల్ హామీకే పరిమితం..

కళాభవనం స్థలంలో హరిత హోటల్ నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్ సూచనల మేరకు మూడేళ్ల క్రితం అప్పటి పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్థలాన్ని పరిశీలించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కళాకారులకు కళాభవనం నిర్మించాలని సాంస్కృతిక శాఖ అధికారులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. డిజైన్‌లో మార్పులు చేసి కళాభవనం, హరితహోటల్ నిర్మించేందుకు ఇచ్చిన హామీ హామీగానే మిగిలింది.

హనుమకొండ జిల్లా పరిధిలోనే ఆడిటోరియాలు..

ఆర్ట్స్ కళాశాల, నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియం, పోతన ఆడిటోరియం, కాళోజీ కళాక్షేత్రం హనుమకొండ జిల్లా పరిధిలోనే ఉన్నాయి. వరంగల్ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన తూర్పులో ఆడిటోరియాలు లేకుండా పోయాయి. కళాభవనం పూర్తయితే తమకు ఆదరణ లభిస్తుందనే ఆశతో జిల్లా కళాకారులు ఎదురుచూస్తున్నారు. కళాభవనం పూర్తి చేయాలని పలుమార్లు కళాకారులు స్థానిక ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి కళాభవనం పూర్తిచేయాలని కళాకారులు కోరుతున్నారు.

కళాభవనం నిర్మిస్తే ప్రాక్టీస్‌కు అనుకూలం



నృత్యంలో శిక్షణ తీసుకున్నా. పోటీల్లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేసేందుకు వరంగల్‌లో అనువైన ఆడిటోరియం లేక ఇబ్బందులు పడుతున్నాం. నేరుగా కాంపిటీషన్‌కు వెళ్లడం వల్ల అనుకున్న ఫలితాలు రావడం లేదు. స్థానిక కళాకారుల కోసం కళాభవనాన్ని వెంటనే పూర్తి చేయాలి.

-శృతిక ఇప్పకాయల, భరతనాట్య కళాకారిణి, లేబర్ కాలనీ, వరంగల్

ఇబ్బందులు పడుతున్నాం..



వరంగల్‌లో ప్రత్యేకంగా కళావేదిక లేకపోవడం వల్ల దూరం వెళ్లి ప్రదర్శనలు ఇవ్వాల్సి వస్తోంది. శిక్షణ అకాడమీలు ఒకే సమయంలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే ఆడిటోరియం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆడిటోరియం ఉంటే కళాకారులకు ఇబ్బంది ఉండదు.

-గజ్జెల రంజిత్, పేరిణి అధ్యాపకుడు, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ, వరంగల్

వెంపటి నాగేశ్వరి పేరుపెట్టాలి



భరతనాట్యం, కూచిపూడి తదితర నృత్యాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన వెంపటి చినసత్యం కుటుంబానికి చెందిన వెంపటి నాగేశ్వరి పేరును కళాభవన్‌కు పెట్టాలి. నాగేశ్వరి స్థానికంగా శిక్షణ సంస్థ ప్రారంభించి ఎంతో మందిని కళాకారులుగా తీర్చిదిద్దారు. ఆమె ప్రారంభించిన శిక్షణ సంస్థ ఇటీవలే 50 ఏళ్లు పూర్తి చేసుకుంది.

-అప్పం చందన, క్రిస్టియన్ కాలనీ

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీఎం శ్రీనివాస్

వరంగల్: రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధరలతో పాటు మౌలిక వసతులు కల్పించాలని వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ చాంబర్‌లో డీడీఎం వి.పద్మావతితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు సీజన్ సందర్భంగా మార్కెట్లలో ప్రభుత్వ కనీస మద్దతు ధర, రైతులు, వ్యాపారులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. మార్కెట్లలో తాగు నీటి సదుపాయం, లైటింగ్, మరుగు దొడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీదుదారుల నుంచి ప్రతి నెల కొనుగోలు నివేదికలు తీసుకుంటూ మార్కెట్ ఫీజు వసూలు చేయాలని, మార్కెట్లలో కాంటాలు తనిఖీ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కె.సురేఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ల కార్యదర్శులు, పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

వరంగల్: ఏనుమాముల పీఎస్ పరిధిలోని పైడిపల్లికి చెందిన రావిరాకుల స్వాతి ఆత్మహత్య కేసులో ఆమె భర్త నిరంజన్, అత్త నిర్మలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మామునూరు ఏసీపీ తిరుపతి తెలిపారు. అత్తింటి వరకట్న వేధింపులకు గురైన స్వాతి ఈనెల 5వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈనెల 9వ తేదీన మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తల్లి కలకోట్ల యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం భర్త, అత్తను అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తిరుపతి తెలిపారు.

పదోన్నతుల్లో పాత పద్ధతినే కొనసాగించాలి



ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల పదోన్నతుల్లో పాత పద్ధతినే కొనసాగించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు ఎ.ఆనందం డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో టీఓఓ 954, ఎన్ఓఓ 37 లాంటి ఆర్డర్లతో మెరిట్ కమ్ సీనియారిటీ అనే అంశాన్ని ముందుకు తెచ్చి రిజర్వేషన్ కమ్ రోస్టర్ విధానానికి అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారని, విద్యుత్ సంస్థలు జారీ చేసిన ఆర్డర్లు కుట్రపూరితమని ధ్వజమెత్తారు. ఆ ఆర్డర్లను రద్దు చేసి ఇటీవల అడ్‌హక్ పద్ధతిలో ఇచ్చిన పదోన్నతులను ఆర్‌ఓఆర్ ప్రకారం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు దర్శనాల మొగిలయ్య, కె.కుమారస్వామి, అజ్మీరా శ్రీరాం నాయక్, రౌతు రమేశ్ కుమార్, ప్రభావతి, నర్సింహారావు, దుర్గం మల్లేశం, నందా రాథోడ్, రమేశ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

17 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఘటన



కాశిబుగ్గ: వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్, ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్‌ఆర్ కృష్ణ

కాశిబుగ్గ : వరంగల్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి 17.425 కిలోల ఎండు గంజాయి తరలిస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. జీఆర్పీ సీఐ పి. సురేందర్ కథనం ప్రకారం.. వరంగల్ ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది సంయుక్తంగా ప్లాట్‌ఫాం-2పై తనిఖీలు చేస్తుండగా నలుగురు వ్యక్తులు రెండు బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించారు. బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి లభించింది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. మహారాష్ట్రలోని పూణె, మన్మాడ్‌కు చెందిన సోహైల్ షకీర్ ఇనామ్‌దార్, షేక్ అఫ్తాబ్ సమీర్, షేక్ సాకిబ్ జిలానీ, అభిషేక్ తిక్కయ్యరెడ్డి స్నేహితులు. వీరు జల్సాలకు అలవాటు పడి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో భువనేశ్వర్ నుంచి మన్మాడ్‌కు గంజాయి తరలించేందుకు రైలులో బయలుదేరారు. మార్గమధ్యలో రైలులో పోలీసులను చూసి భయపడి వరంగల్‌లో దిగారు. మరో రైలు ఎక్కి మన్మాడ్ వెళ్లడానికి యత్నిస్తుండగా వీరిని ఆర్‌పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకున్నారు. ఈఘటనపై ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్ తరలించామని సీఐ పి. సురేందర్ బుధవారం తెలిపారు. గంజాయి విలువ రూ.4,35,625 ఉంటుందన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

రామన్నపేట : గంజాయి విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేసినట్లు ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. కాజీపేట మండలం శాయంపేటలోని గంగాసాని తిరుమలారెడ్డి నగర్‌కు చెందిన షేక్ రషీదా బేగం మండిబజార్ దగ్గరలోని ఓ మసీదు వద్ద భిక్షాటన చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటోంది. భిక్షాటన ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ అవసరాలకు సరిపోకపోవడంతో అప్పులు చేయడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో మానసికంగా కుంగిపోయి ఎలాగైనా సులభంగా డబ్బులు సంపాదించాలనుకుంది. గంజాయి అమ్మితే ఎక్కువ డబ్బులు సంపాదించొచ్చని తెలుసుకుంది. అనంతరం 15 రోజుల క్రితం బల్లార్షా వెళ్లి అక్కడ ఖలీమ్ అనే వ్యక్తి వద్ద నుంచి సుమారు అర కిలో గంజాయి కొనుగోలు చేసి నగరంలోని మండిబజార్ ప్రాంతంలో చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తోంది. రోజు మాదిరిగానే బుధవారం కూడా గంజాయి విక్రయించడానికి మండిబజార్ ప్రాంతంలోని మద్రాసి మసీదు దగ్గర నిల్చుంది. అటు వైపు పెట్రోలింగ్ వెళ్తున్న పోలీసులను చూసి భయపడి పారిపోవడానికి యత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి సుమారు 250 గ్రాముల గంజాయి, రూ.3050 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపారు.

అప్పుల బాధతో తాపీమేస్త్రీ ఆత్మహత్య

- తీగరాజుపల్లిలో ఘటన



కుమారస్వామి (ఫైల్)

సంగెం: అప్పుల బాధతో ఓ తాపీ మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెం మండలం తీగరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లతీగల కుమారస్వామి(54) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7 కొడలుకు టైఫాయిడ్ జ్వరం వచ్చిందని కుమారుడు విక్రమ్ ఫోన్ చేయగా కుమారస్వామి భార్య విజయ ములుగుకు వెళ్లింది. కుమారస్వామి ఒక్కరే ఇంటి వద్ద ఉన్నాడు. బుధవారం ఉదయం గ్రామానికి చెందిన చాపర్తి శంకర్ కూలీ పని కోసం కుమారస్వామి ఇంటికి వెళ్లి పిలవగా పలకలేదు. గేట్‌పై నుంచి చూడగా కుమారస్వామి వరండాలో పడి ఉన్నాడు. పక్కనే ఉన్న నల్లతీగల కట్టయ్య, కరుగుత్త చిన్న గోపాల్‌తో కలిసి లోపలికి వెళ్లి చూడగా టేబుల్‌పై పురుగుల మందు డబ్బా ఉండి అరుగుపై పురుగుల మందు పడిఉంది. టేబుల్‌పై పేపర్‌లో నాకు రూ. 10లక్షల అప్పు ఉంది.. తీర్చలేక చనిపోతున్నా అని సూసైడ్ నోట్ రాసి ఉండడంతో కుమారస్వామి కుమారుడు విక్రమ్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ ఘటనపై భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్. నరేశ్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



ఎల్లయ్య (ఫైల్)

నెల్లికుదురు: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మునిగలవీడులో చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేశ్ బాబు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధర్మారపు ఎల్లయ్య (30) కుటుంబ కలహాలతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం తన భార్యను తల్లిగారింటికి పంపించాడు. బుధవారం మద్యం మత్తులో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేశ్ బాబు తెలిపారు.

మెడికల్ షాపుల్లో డిస్కౌంట్ లేని వివరాలు ప్రదర్శించాలి

హన్మకొండ: మహారాష్ట్ర మాదిరి తెలంగాణ రాష్ట్రంలో ప్రతీ మెడికల్ షాపు ఎదుట డిస్కౌంట్ లేని వివరాలు, నాణ్యత పోస్టర్ ప్రదర్శించాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ బి.యోగానందంను వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందించారు. మెడికల్ షాపుల్లో డిస్కౌంట్, ఆఫర్ల ఔషధాల అమ్మకాలు అరికట్టాలని, ఫార్మాసిస్టులు ఉండేలా చూడాలని కోరారు. వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, ఏఐసీడబ్ల్యూసీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు దొంతి శిల్పా రెడ్డి, నిజామాబాద్ వినియోగదారుల సంక్షేమ సమితి అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు వి.యస్.వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, సంయుక్త కార్యదర్శులు గైని రత్నాకర్ రవి కుమార్ పాల్గొన్నారు.

రైల్వేలైన్ వర్క్‌తో 94 రైళ్ల రద్దు

- పలు రైళ్లు దారి మళ్లింపు.. రీషెడ్యూల్
- ఈనెల 26 నుంచి అమలులోకి..



కాజీపేట రూరల్ : వరంగల్-హసన్‌పర్తి-కాజీపేట ఎఫ్ క్యాబిన్ల మధ్య రైల్వే లైన్ వర్క్‌తో కాజీపేట, వరంగల్ మీదుగా వివిధ మార్గాల్లో నడిచే పలు రైళ్లను ఈనెల 26వ తేదీ నుంచి రద్దు చేసి మరికొన్ని రైళ్లను దారిమళ్లించి, రీషెడ్యూల్ చేసి నడించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు.

రద్దయిన ప్రధాన రైళ్ల వివరాలు..

26 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు కాజీపేట-సిర్‌పూర్ టౌన్(17003) డైలీ ప్యాసింజర్, 27 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్‌పూర్ టౌన్-భద్రాచలంరోడ్ (17034) డైలీ ప్యాసింజర్, 26 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు భద్రాచలంరోడ్-బల్హర్షా(17033) డైలీ ప్యాసింజర్, బల్హర్షా-కాజీపేట(17004) డైలీ ప్యాసింజర్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు కాజీపేట-డోర్నకల్ (07753) పుష్‌పుల్, డోర్నకల్-కాజీపేట (07754) పుష్‌పుల్, 26 నుంచి అక్టోబర్ 7 వరకు కరీంనగర్-సిర్‌పూర్‌టౌన్ (07765) పుష్‌పుల్, 27 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్‌పూర్‌టౌన్-కరీంనగర్ (07766) పుష్‌పుల్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు డోర్నకల్-విజయవాడ (07755) పుష్‌పుల్, విజయవాడ-డోర్నకల్ (07756) పుష్‌పుల్, 23 నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు సికింద్రాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్(12757) డైలీ ఎక్స్‌ప్రెస్, సిర్‌పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (12758) డైలీ ఎక్స్‌ప్రెస్, 28, 29, అక్టోబర్ 2,3,6,7,10వ తేదీల్లో హైదరాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17011) డైలీ ఎక్స్‌ప్రెస్, సిర్‌పూర్‌కాగజ్‌నగర్-బీదర్ (17012) డైలీ ఎక్స్‌ప్రెస్, బీదర్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17012) డైలీ ఎక్స్‌ప్రెస్, 22 నుంచి అక్టోబర్ 8 వరకు సికింద్రాబాద్-సిర్‌పూర్‌కాగజ్‌నగర్ (17233) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 8 వరకు సిర్‌పూర్‌కాగజ్‌నగర్-సికింద్రాబాద్ (17234) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 7 వరకు గుంటూరు-సికింద్రాబాద్ (17201) డైలీ ఎక్స్‌ప్రెస్, 24 నుంచి అక్టోబర్ 8 వరకు సికింద్రాబాద్-గుంటూరు (17202) డైలీ ఎక్స్‌ప్రెస్, 23 నుంచి అక్టోబర్ 2 వరకు సికింద్రాబాద్-గుంటూరు(12706) డైలీ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-సికింద్రాబాద్ (12705) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు విజయవాడ-సికింద్రాబాద్ (12713) డైలీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విజయవాడ(12714) డైలీ ఎక్స్‌ప్రెస్, 26 నుంచి అక్టోబర్ 7 వరకు భద్రాచలంరోడ్-సికింద్రాబాద్ (17660) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 6 వరకు సికింద్రాబాద్-భద్రాచలంరోడ్(17659) డైలీ ఎక్స్‌ప్రెస్, 25 నుంచి అక్టోబర్ 7 వరకు విజయవాడ-గుంటూరు (07464) డైలీ ఎక్స్‌ప్రెస్, 29 నుంచి అక్టోబర్ 6 వరకు యశ్వంత్‌పూర్-జబల్‌పూర్ (12193) ఆదివారం వీక్లీ, 28 నుంచి అక్టోబర్ 5 వరకు జబల్‌పూర్-యశ్వంత్‌పూర్ (12194) శనివారం వీక్లీ, 27 నుంచి అక్టోబర్ 1,4వ తేదీల్లో యశ్వంత్‌పూర్-కోర్బా (12251) మంగళ, శుక్ర వీక్లీ, 29 నుంచి అక్టోబర్ 3,6వ తేదీల్లో కోర్బా-యశ్వంత్‌పూర్ (12252) గురు, ఆది వీక్లీ, 22 నుంచి అక్టోబర్ 26, 27, 29, అక్టోబర్ 3, 4వ తేదీల్లో గోరఖ్‌పూర్-కోచ్‌వెలి(12511) గురు, శుక్ర, శని వీక్లీ, 24,26,27,29, అక్టోబర్ 3,4 తేదీల్లో కోచ్‌వెలి-గోరఖ్‌పూర్(12512) మంగళ, శుక్ర, ఆది వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు..

కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 41 రైళ్లను వయా విశాఖపట్నం, విజయనగరం, రాయగఢ్, నాగ్‌పూర్ మీదుగా దారి మళ్లించి, కాజీపేట, వరంగల్ మీదుగా ప్రయాణించే 27 రైళ్లను రీషెడ్యూల్ చేసి నడిపిస్తున్నట్లు వారు తెలిపారు.

మహిళా పోలీసులు క్రీడల్లో రాణించాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా



శిక్షణార్థులకు బహుతులు అందజేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

మామునూరు: మహిళా పోలీసులు విధినిర్వహణతోపాటు క్రీడల్లో రాణించాలని వరంగల్ సీపీ అంబర్‌కిషోర్ ఝా సూచించారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ ఆధ్వర్యంలో శిక్షణార్థులైన మహిళా కానిస్టేబుళ్లకు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న క్రీడాపోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. సీపీ ముఖ్యఅతిథిగా హాజరై తొలుత శిక్షణార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు సీపీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే శాఖపరమైన గుర్తింపుతోపాటు ఉన్నత స్థానానికి వెళ్లేందుకు దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో బీరామ్ ప్రకాశ్, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సతీశ్‌బాబు, రవీందర్, పాండు, భిక్షపతి, నవీన్‌కుమార్, చంద్రశేఖర్, కాశీరాం, మహేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు యువతి అప్పగింత

వర్ధన్నపేట: తప్పిపోయిన యువతిని పోలీసులు బుధవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ లేబర్ కాలనీకి చెందిన పాలిపాక ప్రసాద్-లక్ష్మి దంపతుల కుమార్తె బస్సు ఎక్కి ఉప్పరపల్లి గ్రామానికి వచ్చింది. గ్రామస్తులు ఆ యువతిని చేరదీసి వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాలు సేకరించి పోలీసులు తల్లిదండ్రులకు సమాచారం అందించి ఆమెను అప్పగించారు. కూతురిని క్షేమంగా అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్పీ డ్రైవర్ యుగేందర్ సస్పెండ్

- క్రిమినల్ కేసులో జైలు శిక్ష
- సమాచారం ఇవ్వని పోలీసులు

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాపరిషత్ డ్రైవర్ ఎం.యుగేందర్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. క్రిమినల్ కేసులో అరెస్టయిన ఆయన ఈ ఏడాది జూలై 21 నుంచి ఆగస్టు 17 వరకు కరీంనగర్ జైలులో ఉన్నాడు. వివరాలిలా ఉన్నాయి.. జూలైలో జరిగిన బదిలీల్లో పరకాల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో డ్రైవర్‌గా పని చేస్తున్న యగేందర్ వరంగల్ అర్బన్ జెడ్పీకి బదిలీపై వచ్చాడు. జూలై 21లోపు జాయిన్ కావాల్సి ఉండగా.. పరకాలలో రిలీవ్ కాలేదు. జెడ్పీలో రిపోర్టు చేయలేదు. దీంతో సందేహం వచ్చిన జెడ్పీ అధికారులు, సిబ్బంది ఆరా తీయగా.. క్రిమినల్ కేసులో జైలుకు వెళ్లినట్లు తెలుసుకున్నారు. క్రిమినల్ కేసులో గోదావరిఖని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ నిమిత్తం కరీంనగర్ జైలుకు పంపారు. దీంతో వరంగల్ అర్బన్ జెడ్పీ అధికారులు గోదావరిఖని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి రికార్డులు తెప్పించుకుని పరిశీలించి జెడ్పీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు పరిస్థితి వివరించారు. ప్రత్యేకాధికారి అనుమతితో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా యుగేందర్‌ను సస్పెండ్ చేస్తూ జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగి అరెస్టు అయితే పోలీస్ స్టేషన్ నుంచి ఆ సమాచారాన్ని సంబంధిత శాఖ, కార్యాలయం ఉన్నతాధికారికి అందిస్తారు. యుగేందర్ విషయంలో పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. జైలుకు వెళ్లిన ఉద్యోగిని సస్పెన్షన్ నుంచి తప్పించుకునేందుకు రహస్యంగా ఉంచినట్లు తెలుస్తోంది.

ఐసీఏఆర్ పరీక్షల్లో జాతీయ ర్యాంకులు

- వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థినుల ఘనత



వి.హర్షిత



బి.శ్వేత

వరంగల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్)నిర్వహించిన పరీక్షల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం బుధవారం తెలిపారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్షలో జాతీయ స్థాయిలో వెల్ది హర్షిత 'వాటర్ సైన్స్-టెక్నాలజీ' విభాగంలో 2వ ర్యాంకు సాధించిందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థి బండేవాలి శ్వేత సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ పరీక్షలో జాతీయస్థాయిలో 6వ ర్యాంకు, 'వ్యవసాయ విస్తరణ' విభాగంలో ఎస్సీ కేటగిరీలో 1వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వరంగల్ వ్యవసాయ కళాశాలకు ఇటీవల వ్యవసాయ యూనివర్సిటీ ఉత్తమ కళాశాలగా గుర్తింపు వచ్చిందన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డీన్ బలరాంతో పాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.హేమశరత్ చంద్ర, అధ్యాపకులు అభినందించారు.